"ఆదాగంట ఆగుసార్ నా బండి పోతుంది. నిన్ను తోల్కపోత ఆడకి" లారీని చూయిస్తూ చెప్పాడు దాని డ్రైవర్

ప్రక్కనున్న వ్యక్తి గడియారం, పదకొండుని సూచిస్తూంది.

ఇంకో అర్థగంట! తనని తాను సమాధాన పరచుకున్నాడు కిరణ్. గంటయినా కాలేదు. టీ తాగి అయినా సమయాన్ని ఎలాగో వెళ్ళబుచ్చాలి "ఏక్ చాయ్ లావ్" చెప్పాడు పాక యజమానితో.



# అవసరం ద రైట్

## ఆర్.కె. ధరణికోట

"చాయ్ హోనా క్యా?" అడిగి అనుమాన నివృత్తి జరిగిన తరువాత ఎర్రని నిప్పులపై సలసల కాగుతున్న చాయ్‌ని గ్లాసులోకి పోసి కిరణ్ చేతికి అందించాడు.

పైరు నల్లు ఊదదీస్తున్న వారివంక చూస్తూ మెల్ల మెల్లగా గ్లాసులోని చాయ్‌ని చప్పరిస్తున్నాడు.

అప్పుడే అక్కడికి వచ్చి చేరిన అయిదుగురు వున్న గుంపు వాతావరణంలోని నిశ్శబ్దాన్ని కొంత తగ్గించింది. ఆ గుంపులోని పోలీసుకానిస్టేబుల్ వారిపై అజమాయిషీ చేయడం కనిపించింది.

మా తాతలు నేతులు తాగారు. మా మూతుల వాసన చూస్తు పద్ధతిలో సాగిపోతున్నాయి అతని మాటలు.

"చాయ్ తాగుదాం సార్" గుంపులో నుంచి ఎవరో అన్నారు.

"మీరు తాగండి నేను చాయ్ తాగను"

పాలు తాగండి చాయ్ తాగకుంటే! ఏక్ కప్ అచ్చా దూద్ దేవ్"

"మలాయ్ డాల్కేదేవ్" పూరించాడు కానిస్టేబుల్.

కాస్త వింతగా కనిపించింది కిరణ్‌కి. నాలుగు రోజుల ముందే, అక్షరాలా ఆ కానిస్టేబుల్ 'టీ' తాగుతూ కనిపించాడు! మరి ఈ క్షణం... 'అవకాశం ఎంత గొప్పదో" ఒకసారి గుర్తుకు వచ్చింది.

తన జీవితం మాత్రం అవకాశం క్రింద నలిగి పోవడం లేదు. పదకొండున్నర గడిచిపోయినట్టుంది. లారీ కదిలే సూచనలేవీ కనిపించలేదు.

"లారీ ఎప్పుడు పోతదో అడుగు సార్" కానిస్టేబుల్‌తో ఎవరో అన్నారు. లారీ యజమానితో మాట్లాడిం తర్వాత వచ్చి కూర్చుంటూ కానిస్టేబుల్

"ఇంకో ఆదా గంటయితదంట"

ఇంకా ఎన్ని ఆధా గంటలు గడవాలో! విరక్తితో కూడిన చిన్న నవ్వు పెదాల గుండా బయటికి వచ్చింది.

ఆ సాయంత్రం వర్షం కురిసి వెలిసినట్టయింది. చల్లని గాలి జివ్వు, జివ్వుమంటూ వీయడం మొదలు పెట్టింది.

చల్లని చలి ఎంత ముడుచుకొని కూర్చోడానికి ప్రయత్నించినా తగ్గడం లేదు. అనుకోకుండా చల్లని వణుకు ప్రారంభమయింది.

'ఛా ఇదీ ఒక బ్రతుకేనా ప్రతీ క్షణం భయపడు కుంటూ' బ్రతుకుని ఒక నిముషం తిట్టుకున్నాడు కిరణ్.

గత్యంతరం లేదు ఏం చెయ్యాలి. పుట్టడం అలా పుట్టాం. మధ్య తరగతిలో వుండడం ఏ జన్మలో చేసుకున్న పాపమో?

రోజూ రొటీన్‌గా జరిగేదే అది. అట్లా తిట్టుకోవడం ఎం.ఎస్సీ. అయిపోయిన క్రొత్తలో కాస్త థ్రిల్లింగ్‌గా వుండేది. కాని ఇప్పుడు దానిలోను థ్రిల్ ఏమీకనిపించడం లేదు.

అప్పుడే అక్కడికి వచ్చి చేరిన నాయకుడు ఒకతను తన తోటి వాళ్ళతో అంటున్నాడు "నడిచిపోదామా?"

"అబ్బా" అప్రయత్నంగా నోటి నుంచి శబ్దం

బయటకు వచ్చింది అక్కడ వున్న అందరి నోళ్ళ నుండి.

"పది కిలోమీటర్లు సార్! తక్కువనుకుంటున్నావా?"

"పది కిలోమీటర్లకిభయపడితే ఇంగ నువ్వు పోరాటం చేసినట్టే. 1967లో మేము..." మొదలయ్యింది మద్దెల వాదన.

'అమ్మో పది కిలోమీటర్లు. అదీ పన్నెండు గంటల రాత్రి వణుకు పుట్టిస్తున్న చల్లో...' మనసు కెవ్వు మంటూ అరిచింది. పన్నెండు దాటి పోయింది.

'క్యాహువా భాయ్" ఎవరో అడిగారు డ్రైవర్ని.

"హోగయా సాబ్. అవుర్ ఏక్ ఆదా గంట."

'ఒఒ గంట? ఇంకెన్ని ఆదా గంటలో' మనసు మెల్లిగా ప్రశ్నించింది.

ఎన్ని కలలు కనేవాడు తను. క్లాసులో ఫస్ట్ నేను అని అందరి ముందు గర్వంగా చెప్పుకునే వాడు. పరీక్షా ఫలితాలు చూసిన ప్రతిక్షణం ఇంట్లో వాళ్ళు ఎంత ఆనంద పడేవాళ్ళు "కష్టానికి తగ్గ ఫలం వుంటుంది. కిరణ్ని చూడండి" అందరూ అనుకుంటూ వుంటే తను చాలా ఆనందించేవాడు.

చదువుకున్న వాతావరణం ప్రక్కన లేకపోయినా "నేను చదువుకుంటా" నన్న దృఢ అభిప్రాయం, తల్లిదండ్రుల కష్టం కిరణ్ని పోస్ట్ గ్రాడ్యుయేట్గా గుర్తించింది.

చదివిందాక ఒక మెట్టుగడిచిపోయింది. ఉద్యోగమనే రెండో మెట్టు దొరక్కపోతుందా అనుకున్న తనకు, మెట్టు కాకుండా అగాధం ఎదురవ్వడం భరించలేక పోతున్నాడు.

చదువుకు తగ్గ ఉద్యోగం కావాలనుకోవడం తప్పా?

అవకాశాలు వచ్చినా సరిగా వుపయోగించుకొన లేకపోతే తనని తాను నిందించుకొనేవాడు, కాని చదువు అయిపోయిన మూడు సంవత్సరాలలో వచ్చిన అవ కాశాలు అతి తక్కువ. నాలుగు అవకాశాల్లో మూడింట్లో ఇంటర్వ్యూ దాకా వెళ్ళాడు. అయినా 'ఫలితం' శూన్యం.

"ఇంకో అర్థ గంటట, ఈ రాత్రి ఇక్కడే చంపే ట్టున్నాడు" ఎవరో అంటున్నారు.

"అచ్ఛా ఇంకో అర్థ గంట" నమ్మకం సన్నగిల్లు తోంది.

అసలు తనదే బుద్ధి తక్కువ — సరి అయిన టైం తెలుసుకోకుండా తగుదునమ్మా అని బస్టాండ్కి లేటుగా రావడం! అనుభవించాలి మరి. రేపు ఎలాగయినా ఫస్ట్ బస్కి బయలుదేరాలి. ఆ సంగతి తనకీ తెలుసు— అయినా తెలియనట్టు ప్రవర్తించడం 'తగిన శాస్తి జరగాల్సిందే' తనదేం స్థిరమయినఉద్యోగమా? తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటిది' దాన్ని కాపాడుకోవడం తెలియొద్దూ!?

అనుకున్న రోజు హెడ్ క్వార్టర్లో లేనందుకు పది రోజుల క్రితం జరిగిన పరాభవం గుర్తుకు వచ్చింది.

"నువ్వేం చేస్తవ్ సార్?" ప్రక్కనున్నతను ప్రశ్నించాడు.

## మంచుశిల

నువ్వొక శిలవనుకుని
నిన్నొక శిల్పంగా మార్చుదామనుకున్నా
కానీ,
ఇప్పుడే తెలుసుకున్నా
నువ్వొక
"మంచుశిల"వని.

—కురుమద్దాలి పద్మావతి

"గ్రౌండ్ వాటర్ కన్సల్టెన్సీలో జియాలజిస్ట్గా చేస్తాను".

"జియాలజిస్టంటే మీటరు పెట్టి బావులు టెస్ట్ జేసెటోల్లే?"

"అవునవును అదే"

"జబర్దస్త్ కమాయించుడుంటది, ఆదా గంట పనికి మూడు వందలు దీస్కుంటరు, ఒక్క దినంలో మా వూర్ల పద్దెనిమిది నూర్లు కమాయించుకున్నరు. అదెట్ల జేస్తరంటె..." సర్వే గురించి తనకు తెలిసింది చెబు తున్నాడు.

నిజంగా ఆలోచించిచూస్తే సంపాదనబాగుంటుంది. కాని దానికి కారకులయిన తనలాంటి వాళ్ళు మాత్రం అర్థంలేని జీవితం గడపాల్సిందే.

సంపాదన మాట ప్రక్కన వుంచి గౌరవం విషయం ఆలోచించినప్పుడు అదీ శూన్యంగా కనిపిస్తుంది. అవ కాశం లేక తాను ఒక సంస్థలో ఉద్యోగం చేసినప్పుడు, ఆ సంస్థకి అధికారి అయినటువంటి ఉద్యోగి తనూ ఉద్యోగి నన్న విషయం మరచిపోయి పెత్తనం చెలాయించడం, అర్హత సమానమయినదే అయినా... ఎన్నిసార్లు ఆలో చించినా ఆలోచన ఆలోచనగానే మిగిలిపోతుంది. గత్యంతరం లేదు ఉద్యోగం చేయాలి. ప్రభుత్వ సంస్థల్లో జరుగుతున్న ఉద్యోగ నియామకం అనూహ్యంగా పడి పోయి, మూడు సంవత్సరాల్లో 45%గా వున్నది 15%గా మారింది అట్లాంటి పరిస్థితులలో అవకాశం ఎక్కడి నుంచి పుట్టుకు వస్తుంది. కష్టం ప్రతిఫలం ఎప్పుడు ఎలుకా, పిల్లులే అన్న విషయం గుర్తుకువచ్చింది కిరణ్కి.

తను పొందుతున్న జీతంగురించి ఆలోచించినప్పుడు ఒక యువ కవి అన్నమాటలు 'రక్త మాంసాల్ని పిండుకు తిని, ఒక చిన్న ముక్కని జీతం పేరిట మళ్ళీ ఆ కళేబరానికి వేస్తే రుచిగా ఉందంటూ నంజుకు తింటాడు' గుర్తుకు వచ్చాయి.

"పండుకుంటున్నడు డ్రైవర్ సాబ్. సంగతేంది పోతడా పోడా?' అనుమానం వ్యక్తం చేశాడు ఒకతను.

"ఇప్పుడు కూలోల్లని తొల్కపోవాల్నంట, పక్కూర్ల వుండిరంట ఆల్లు"

"ఆ ఇంగ పోయినట్టె! సల్లగున్నది ముందుగాల పడుచు పెండ్లాలు ఆల్లనొదుల్తార్, ఆల్లొచ్చినట్టే ఇంగ మీరు పోయినట్టె! హోటల్ యజమాని అంటున్నాడు. "కోయి బాత్ నయి సాబ్ పండుకోండ్రి. రూం కాలిగున్నది. కప్పుకును దొక్కటే కష్టం."

"ఆ పడుకుంటె కష్టం. రేపు పొద్దుటే ఆరు గంట్ల వరకు ఆఫీసు దగ్గర వుండాలి. ససేమిరా సెలవు ఇవ్వనన్నడు ముందే. పోని ఒక్కసారి డ్రైవర్ని అడిగి చూస్తే?"

"పోనంటున్నాడు సార్ ఇప్పుడు. రేప్పొద్దు గాల పోతడంట."

ఒక్క నిముషం అందరి కళ్ళలోనూ బాధ.

"నడిచిపోదాం."

పది కిలోమీటర్లు ఒకటిన్నర గంటల రాత్రి, చిమ్మ చీకటి అయినా సరే. పదకొండుమంది అడుగులో అడుగు వేస్తున్నారు. చల్లనిగాలి రివ్వు రివ్వుమని వీస్తోంది. అందరి కళ్ళలోనూ గమ్యం అందరి బుర్రల్లోను 'మన్నె గూడ చౌరస్తా — వికారాబాద్' పదాలు తిరుగు తున్నాయి.

కిలోమీటర్ల రాళ్ళు కదిలిపోతున్నప్పుడు, కళ్ళల్లో ఆనందం తళుక్కున మెరుస్తున్నది. వణుకు పుట్టిస్తున్న చలి ఎక్కడికి ఎగిరిపోయిందో ఎవరికీ తెలియదు.

మార్చ్ చేస్తున్న అందరిలోనూ ఆ రాత్రి వాళ్ళని నడిపిస్తున్న 'రేపటి అవసరం'పై చెప్పలేని కోపం. ఆ అవసరమనే పెనుభూతం ఒక్క క్షణం వాళ్ళ ముందుకు వచ్చి నిలబడితే ఆ క్షణం దాన్ని హత్య చేసేవాళ్ళు. ముక్కలు ముక్కలుగా నరికి కాకులకు గద్దలకు వేసే వాళ్ళు. కానీ ఆ అవసరం ఎవరికీకనిపించదు. మనుషుల్ని బాధ పెట్టడం మాత్రమే దానికి తెలుసు 'అవసరం ద గ్రేట్ నీకు జోహర్లు' అస్పష్టంగా గొణుక్కున్నాడు కిరణ్.

ఇప్పుడు కిరణ్ మనసును ఆ రాత్రి దొరికే ముప్పావు గంట తీరిక గుర్తుకు వచ్చి ఆనంద పరుస్తుంది. ఆ తరువాత రెసిస్టివిటీ మీటర్ముందు కూర్చుని మార్చ్ మార్చ్ అంటూ రీడింగ్స్ తీసుకునే తన రూపం గుర్తుకు వస్తున్నది.

కీచురాళ్ళు అరుపులు, కప్పల బెక బెకలు ఆ శరీరాలన్నీ సాగిపోతున్నాయి చీకటిని చీకటిగానేవదిలేస్తూ మును ముందుకు.

◆

